క్లుప్తంగా

ఘనంగా ఆదిత్యుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం భాద్రపద శుద్ధ ఏకాదశి (పరివర్తన ఏకాదశి) సందర్భంగా శనివారం ఉదయం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని చాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆగమ శాస్త్ర ప్రకారం కల్యాణం జరిపించారు. సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేసారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మ, ఈవో డీఎల్వీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు


హుస్సేన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో రమేష్‌బాబు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ఈఓ డీఎల్వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతాన్ని పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ ఆర్ఎస్.మిశ్రా, రీసెర్చ్ ఆఫీసర్ ఆకాష్ త్రిపాఠి, సీనియర్ ఇన్వెస్టిగేటర్ అశోక్‌కుమార్ లక్కర్స్, స్థానిక బీజేపీ నేతలు ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాలం, శవ్వాన ఉమామహేశ్వరి, ఎస్టీ సంఘ నేత వాభ యోగి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబానికి ఆర్థిక సాయం


సింహాచలం కుటుంబ సభ్యులకు సాయాన్ని అందజేస్తున్న తోటి కార్మికులు

రణస్థలం: బంటుపల్లిలోని యునైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో ఎంఎస్ఆర్ కాంట్రాక్టర్‌లో కార్మికుడుగా పనిచేసిన కొంగరాపు సింహాచలం అనారోగ్యంతో ఇటీవల మరణించారు. అతని కుటుంబానికి తోటి కాంట్రాక్టర్ కార్మికులంతా కలిసి ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఇలా సమకూరిన 2,60,797 రూపాయలను మృతుని కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు.

గార ఎస్‌ఐగా జనార్దన్ బాధ్యతల స్వీకరణ



గార: మండల ఎస్‌ఐగా రెల్ల జనార్దన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రివేళల్లో గస్తీ ముమ్మరం చేస్తామని, తీర ప్రాంతంలో భద్రతా చర్యలు చేపడతామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానన్నారు. ఎస్‌ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీని కలిసిన సీఐ, ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్ : ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శనివారం ఆయా స్టేషన్లల్లో విధుల్లో చేరిన సీఐ, ఎస్‌ఐలు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ సిటీ స్టీల్‌ప్లాంట్ సౌత్ ట్రాఫిక్ నుంచి శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్‌కు వచ్చిన సీఐ వి.నాగరాజుతో ఎస్పీ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్‌పై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని సూచించారు. ఎస్పీని కలిసిన వారిలో శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ ఎం.హరికృష్ణ, గార ఎస్‌ఐ రెల్ల జనార్దనరావు, ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్, నౌపడా ఎస్‌ఐ జి.నారాయణస్వామి, నందిగాం ఎస్‌ఐ మొహమ్మద్ అలీ, కోటబొమ్మాళి ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఉన్నారు.

సుధాకర్‌కు అభినందనలు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నడక విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించిన శ్రీకాకుళం నగరానికి చెందిన సంజీవ్ నళినీ సుధాకర్‌ను శనివారం స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

29న శతాధిక కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సాహితీ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 29న అనకాపల్లి, గౌరీ గ్రంథాలయంలో శతాధిక కవి సమ్మేళనం జరుగుతుందని, కవులంతా హాజరు కావాలని సాహితీ ప్రముఖులు ఇ.వేమన, సురంగి మోహనరావు, జంధ్యాల శరత్‌బాబు, తాళ్లూరి విజయలక్ష్మణ్‌లు కోరారు. స్థానిక ఒక కళాశాలలో కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు.

సాహితీ సేవలో మహతి


మహతి పురస్కారం అందుకుంటున్న బండారు చిట్టిబాబు (ఫైల్)

- రెండున్నర దశాబ్దాలుగా సాహిత్యకారులకు సత్కారం
- నేడు సంస్థ 26వ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్ : నగరానికి చెందిన మహతి సంస్థ సాహిత్య సేవలో ప్రముఖ పాత్ర పోషిస్తోంది. డాక్టర్ ఈశ్వర సీతారామ ధన్వంతరి 1998లో ధన్వంతరి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ పేరిట మహతి సంస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సాహిత్య ప్రక్రియలు నిర్వహిస్తూ సాహిత్యకారులను సత్కరించడం వంటి సాహిత్య సేవ చేస్తున్నారు. 26 ఏళ్లుగా ఎంతో మంది ప్రముఖులను నగరానికి రప్పించి వారిచే సాహిత్య ప్రసంగాలు చేయించడంతో పాటు లబ్ధప్రతిష్టులైన వారిని ఘనంగా సత్కరిస్తున్నారు.

ఎందరో మహానుభావులు..

సంస్థ ఏర్పడిన నాటినుంచి ప్రముఖ హరికథకులు మండా కమలకుమారి, దూసి బెనర్జీ, బుసకల రంగారావులచే హరికథలను, ఘంటసాల ఆరాధనోత్సవాలు, మీగడ రామలింగస్వామిచే సంగీత అష్టావధానం, సాహితీ ప్రముఖులచే సాహితీ ప్రసంగాలు ఏర్పాటు చేస్తూ వచ్చారు. మహతి విశిష్ట పురస్కారాలను ప్రారంభించి ఇప్పటికి 16 మందిని ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. ఇప్పటి వరకు గొల్లపూడి మారుతీరావు, కాళీపట్నం రామారావు, గరికపాటి, శలాక రఘునాథశర్మ, సామవేదం షణ్ముఖశర్మ, మల్లాజ్యోస్యుల శ్రీమన్నారాయణ, ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు, ఆచార్య కోలవెన్ను మలయవాసిని, మానప్రగడ శేషసాయి, భరతశర్మ, కాకరపర్తి ముఖలింగం, ఎర్రాప్రగడ రామకృష్ణ, సనపల నారాయణమూర్తి, పైడి హరనాథరావు, కళాప్రవీణ బండారు చిట్టిబాబు తదితరులకు మహతి పురస్కారాలు ప్రదానం చేశారు.

విజయవంతం చేయండి..



ఈ నెల 15న మహతి సంస్థ 26వ వార్షికోత్సవం నగరంలోని ఉపనిషన్మందిరంలో నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మహతి విశిష్ట సాహితీ పురస్కారాన్ని ఓరుగంటి రాజరాజేశ్వరరావుకు అందజేయనున్నాం. సాహిత్యాభిమానులంతా హాజరుకావాలి.

– డాక్టర్ ఈశ్వర సూర్య సంపత్‌కుమార్, మహతి సంస్థ కన్వీనర్

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తూర్పు కాపు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంకిత భావంతో పనిచేసే ప్రతీ ఉద్యోగికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని జిల్లా తూర్పు కాపు సామాజిక వర్గం అధ్యక్షుడు సురంగి మోహనరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రయివేటు హోటల్లో జిల్లా తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ తూర్పు కాపు సామాజికవర్గానికి చెంది దేశ విదేశాల్లో స్థిరపడిన వారంతా శ్రీకాకుళంలో నిర్మాణం కాబోతున్న సామాజిక భవన నిర్మాణానికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. త్వరలో చేపట్టనున్న నామినేటెడ్ పదవుల్లో తూర్పు కాపులకు ప్రాధాన్యమివ్వాలని తీర్మానం చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్, కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవులు తూర్పుకాపులకే ఇవ్వాలని కోరారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కరిమి రాజేశ్వరరావు, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయ అవార్డు పొందిన వి.సత్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో తూర్పు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం.రామజోగినాయుడు, కార్యదర్శి పడాల తమ్మునాయుడు, గౌరవాధ్యక్షుడు అంకడాల తవిటన్న, సంఘ నేతలు కిల్లారి నారాయణరావు, లోలుగు వెంకట రాజశేఖర్, వాళ్ల శ్రీరాములునాయుడు, ఎడ్ల రాంబాబు, దన్నాన మోహనరావు, లావేటి సుందరరావు, మక్కా శ్రీనివాస్, పిసిని వసంతరావు, మందస కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఘంటసాల గానావధానం


ఘంటసాల దేశభక్తి గీతాలకు నృత్యాలు చేస్తున్న కళాకారులు


డాక్టర్ రహమతుల్లాను సత్కరిస్తున్న అతిథులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో శనివారం పర్లాఖిమిడికి చెందిన డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో గానావధాన ప్రక్రియ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఘంటసాలకు సంబంధించిన అంశాలతో అవధాన ప్రక్రియ సాగింది. మధురమైన గీతాలు, ఘంటసాల జీవిత విశేషాలతో లఘునాటిక ప్రదర్శన జరిగింది. 'అహనా పెళ్లంట' గీతానికి సూర్యకుమారి అభినయ నృత్యం, ఘంటసాల పాటలతో కవాలీ ప్రదర్శన వినూత్నంగా సాగాయి. అంతకుముందు రహమతుల్లాను సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ఎల్.రామలింగస్వామి, మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, నక్క శంకరరావు, పులఖండం శ్రీనివాసరావు, నిక్కు హరిసత్యనారాయణ, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

పర్తియాత్రకు మంత్రికి ఆహ్వానం


మంత్రిని ఆహ్వానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల ద్వారా విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా ఏడు వేల మందికి అమృతకలశాలు అందచేశామని వివరించారు. పర్తియాత్రకు జిల్లా నుంచి 5వేల మంది హాజరవుతున్నారని, మంత్రి కూడా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, సేవాదళ్ కో–ఆర్డినేటర్ నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతు సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కమ్యూనిస్ట్ యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం రైతాంగానికి వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరని లోటని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వెలమల రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు బి.వాసుదేవరావు కె.కొండయ్య, టి.అజయ్‌కుమార్, టి.నందోడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక కల్యాణం


పాండ్రంగి వీధిలో దీపారాధన


నక్కవీధిలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమా జలలేశ్వరాలయం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం సిద్ధి, బుద్ధి సమేత గణపతి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణం జరిపించారు. పాండ్రంగి వీధిలోని రామమందిరం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దీపారాధన నిర్వహించారు. ఓం, శివలింగాకారాల్లో భక్తులు దీపాలను వెలగించారు.


రణస్థలం: గొర్లెపేటలో దీపారాధన


ఎచ్చెర్ల క్యాంపస్: కుంచాలకుర్మయ్యపేట సాయిభారత్ నగర్‌లో అన్నదానం చేస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురంలో అన్న ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


జి.సిగడాం: దవళపేటలో పూజలందుకుంటున్న గణనాథుడు

సంక్షిప్తంగా..

వైద్యులు విధులు బహిష్కరణ


నిరసన తెలియజేస్తున్న వైద్యులు

జి.సిగడాం: బాతువ, జి.సిగడాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం విధులను బహిష్కరించారు. జీవో నంబర్ 85 రద్దు చేయాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో విధులను బహిష్కరించినట్టు వైద్యులు యశ్వంత్, జి.అనూష, ప్రతిష్టశర్మ, పేకల సుమబిందు తెలిపారు.

'సూపర్‌సిక్స్ పథకాలు ఎక్కడ'

జి.సిగడాం: ఎన్నికల ముందు ప్రజలకు లేనిపోని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారని వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి ప్రశ్నించారు. దవళపేట గ్రామంలో శనివారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు నేరుగా అందేవన్నారు. సమావేశంలో సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, నాయకులు కంచరాన రమణారావు, పేడాడ నారాయణరావు, శ్యామలరావు, కృష్ణంరాజు ఉన్నారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి చేయాలి


హిందీ ఫోరం లోగో ఆవిష్కరిస్తున్న విజయభాస్కర్, తిరుమలచైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాలల్లో హిందీ భాషాభివృద్ధికి హిందీ ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని పాఠశాల విద్య ఆర్జేడీ(విశాఖపట్నం) బి.వి జయభాస్కర్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం హిందీ ఫోరమ్ ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ కళా వేదికలో జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను, హిందీ భాషాభివృద్ధికి కృషిచేస్తున్న ప్రముఖులు, హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు. అంతకుముందు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య, హిందీ ఫోరం కన్వీనర్ ఐ.సంతోష్‌కుమార్, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ కె.వెంకట్ ఉజ్వల్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, హెచ్‌పీసీఎల్ విశ్రాంత జీఎం బి.భాస్కరరావు, లియాకత్ ఆలీఖాన్, బి.మల్లేశ్వరరావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ వ్యవస్థాపకులు నటుకుల మోహన్, డాక్టర్ బాడాన దేవభూషణరావు, పిసిని చంద్రమోహన్, హిందీ ఫోరం సమన్వయకర్తలు ఐ.సంతోష్ కుమార్, మండపల్లి రామకృష్ణారావు, నిరంజన్, తదితరులతో హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ హిందీ పక్షోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏపీహెచ్‌బీ కాలనీలోని విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమ సంఘం భవనంలో హిందీ మంచ్ జిల్లా అధ్యక్షులు దొంతం పార్వతీశం అధ్యక్షతన హిందీ దివస్ నిర్వహించారు. సహాధ్యక్షులు సూరంపల్లి బ్రహ్మాజీ సభ్యులతో హిందీ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కనుగుల సత్యం, రొంపివలస రామారావు, కోనే శ్రీధర్, ఎం.వి.మల్లేశ్వరరావు, షేక్ షరీఫ్, వి.భగత్, ఆర్.ఉదయభాస్కర్, రాంబాబు పాల్గొన్నారు.

సుమధుర కవి జంధ్యాల

శ్రీకాకుళం కల్చరల్: సుమధుర పద్య రచనా శైలితో ఆంధ్రా సాహితీ లోకంలో అజరామరమైన కీర్తినందుకున్న కవి జంధ్యాల పాపయ్య శాస్త్రి అని వక్త పొందూరు సుధాకుమార్ అన్నారు. నగరంలోని ఉపనిష్మందిరంలో సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా 'కరుణశ్రీ కవితా సుధ' అనే అంశంపై శనివారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది.

వెంకటేశ్వరలో ఇంజినీరింగ్ డే

ఎచ్చెర్ల క్యాంపస్: మొక్షగుండం విశ్వేశ్వరరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వెంకటేశ్వర కళాశాలలో ఇంజినీరింగ్ డేను ముందస్తుగా శనివారం నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎస్.ఇ.వి.రమణమూర్తి తెలిపారు. వివిధ కళాశాలల ఇంజినీరింగ్ విద్యార్థులకు సాంకేతిక అంశాలతో కూడిన పోటీలు అన్ని బ్రాంచిలలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సౌజన్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఇతర శాఖాధ్యక్షులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లాలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ, పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ దుర్గాప్రసాద్ తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

జి.సిగడాం: రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు అలసత్వం వహించకుండా విధులు నిర్వహించాలని రణస్థలం వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. జి.సిగడాంలోని ఆర్‌బీకేలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈకేవైసీ అవ్వకపోతే ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి యర్రా శారద, ఏఈవోలు ఉన్నారు.

పశువుల లారీ స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: నరసన్నపేట నుంచి విశాఖపట్నం వైపు అనుమతి లేకుండా 23 పశువులతో వెళ్తున్న లారీని ఎచ్చెర్ల పోలీసులు శనివారం పట్టుకున్నారు. అనంతరం లారీని సీజ్ చేశారు. పశువులను కొత్తవలస గోశాలకు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

మహిళకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై కింతలి మిల్లు సమీపంలో రోడ్డు దాటుతున్న కూన లక్ష్మి అనే మహిళలకు శనివారం గాయాలయ్యాయి. విశాఖపట్నం వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన లక్ష్మిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.